క్లుప్తంగా

సీఎం, ప్రభుత్వ విప్ చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న పద్మశాలీ నాయకులు

కథలాపూర్: వేములవాడ నియోజకవర్గం కేంద్రంలో యారన్ డిపో ఏర్పాటు చేసి రూ. 50 కోట్ల నిధులు కేటాయించినందుకు మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల తోపాటు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు మండల పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం క్షీరాభిషేకం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, నాయకులు చెదలు సత్యనారాయణ, పులి హరిప్రసాద్, కారపు గంగాధర్, కట్ట శంకర్, చిలుక అశోక్, మహేశ్, ప్రసాద్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘం ఎదుట పాలకవర్గం నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న పాలకవర్గ సభ్యులు

మల్లాపూర్: మండలంలోని సిరిపూర్ సహకార సంఘం చైర్మన్ బద్దం అంజిరెడ్డి, పాలకవర్గ సభ్యులు ఆదివారం ఒంటి కాలిపై నిల్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సీఈవో అవినీతికి సంబంధించి ఆయన భూములను సంఘానికి అటాచ్ చేసి వేలం వేయగా, ఆ భూములను సొంతం చేసుకున్న వారికి రిజిస్ట్రేషన్ చేయాలని, మెట్‌పల్లి మండలం వేంపేట శివారులోని గత సీఈవోకి సంబంధించి భూమిని అక్రమంగా బదలాయింపు చేసిన వ్యక్తి నుంచి తిరిగి సంఘానికి స్వాధీనం చేయాలన్నారు. తమ డిమాండ్లపై అధికారులు స్పందించే వరకు నిరసన కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో సొసైటీ వైస్‌చైర్మన్ దూలూరి సుధాకర్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

నంబర్‌ప్లేట్ లేని వాహనాలు సీజ్



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై మహేశ్

ధర్మపురి: నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న 25 నంబర్‌ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ రాంనర్సింహారెడ్డి తెలిపారు. ధర్మపురిలో ఆదివారం సాయంత్రం పటేల్ కూడలి వద్ద ఎస్సై మహేశ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ఏఎస్సై అశోక్, కానిస్టేబుళ్లు లింగమూర్తి, స్వామి తదితరులున్నారు.

దసరా ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

పెగడపల్లి: దసరా ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని మల్యాల సీఐ నీలం రవి, పెగడపల్లి ఎస్సై రవికిరణ్ మండల ప్రజలకు సూచించారు. కమ్యూనిటీ పోలీసులో భాగంగా ఆదివారం పెగడపల్లి మండలంలోని నంచర్ల గ్రామాన్ని వారు సందర్శించి రామాలయంలో దుర్గామాత వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రజలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ తొమ్మిది రోజుల పాటు వైభవంగా పూజలందుకున్న దుర్గామాత విగ్రహాలను ప్రశాంతంగా సాగనంపాలని సూచించారు. ఊరేగింపులో డీజేలకు అనుమతి లేదన్నారు. మద్యం సేవించి ఊరేగింపులో పాల్గొని గొడవలు పడితే కేసులు తప్పవని హెచ్చరించారు.సిబ్బందిసంపత్, రవీందర్ పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాలకు ఎస్సైకి ఆహ్వానం

మల్లాపూర్: ఆధ్యాత్మికతతోనే ప్రజలకు ప్రశాంతత చేకూరుతుందని ఎస్సై కిరణ్‌కుమార్ అన్నారు. మల్లాపూర్ మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం శ్రీ కనక దుర్గా కమిటీ సభ్యులు ఎస్సై కిరణ్‌కుమార్‌ని కలిసి దుర్గ నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు శ్రీ దుర్గమాత నవరాత్రోత్సవాలను వైభవంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. దుర్గాదేవి నిమజ్జన ఉత్సవాలకు బందోబస్తును ఏర్పాటు చేస్తామని, వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీ కనక దుర్గా కమిటీ సభ్యులు తోట రవీందర్, నాంపల్లి మారుతి, కైర రామాగౌడ్, మ్యాకల సతీష్,గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



మహిళల జీవితంతో విడదీయలేని బంధం



బతుకమ్మకు మహిళలకు విడదీయలేని అనుబంధం ఉంది. పుట్టింటి నుంచి మెట్టింటికి వచ్చిన మహిళలకు బతుకమ్మ పండుగకు పుట్టింటి వారు కోళలు, కొత్త బట్టలు, పిండి వంటలు తేవడం పూర్వం నుంచి సాంప్రదాయంగా వస్తుంది. మహిళలు రెట్టించిన సంతోషంతో బతుకమ్మ వేడుకల్లో పాల్గొంటారు. ఇది మహిళలకు మాత్రమే దక్కిన అరుదైన గౌరవం.

– గొడిసెల పద్మ, జగిత్యాల

బతుకమ్మ అంటేనే ఆటపాటల సందడి



బతుకమ్మ పండగ వచ్చిందంటే సంతోషం వేరేగా ఉంటుంది. కళాశాలలో, వాడలో బతుకమ్మ ఆటపాటలతో అందరితో కలిసి ఆడుకోవడం చాలా సంతోషంగా ఉంటుంది. బతుకమ్మ పండగ ఘనంగా జరుపుకోవడం కొత్త అనుభూతిని ఇస్తుంది. ఇంట్లోని వారందరం సంతోషంగా గడుపుతాం.

– సిరిపురం మనీషా, డిగ్రీ విద్యార్థిని

సంస్కృతీసంప్రదాయాలకు ప్రతీక



ఆడపడుచులకు అతి పెద్ద పండుగ బతుకమ్మ. సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచేది బతుకమ్మ. బతుకమ్మ పండుగ వస్తే వాడలోని చిన్ననాటి స్నేహితులం అందరం ఒకచోటకు చేరి ఎన్ని గంటలు బతుకమ్మ ఆట ఆడినా క్షణాల్లో గడిచిపోయిందనిపిస్తుంది. బతుకమ్మ పండగ ఆడవారికి ఆనందాన్ని ఇస్తుంది.

– లక్ష్మి భవాని, లెక్చరర్



పెగడపల్లిలో మహిళల పూజలు



కోరుట్లలో పూజలు చేస్తున్న మహిళలు



ముత్యంపేటలో కుంకుమపూజలో మహిళలు

దుర్గామాతకు బోనాలు.. అన్నదానాలు

కోరుట్లటౌన్/రాయికల్/మల్లాపూర్/పెగడపల్లి/సారంగాపూర్: దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.ఆదివారం దుర్గామాత భక్తులకు అన్నపూర్ణదేవీగా, లలితా త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చారు. పలుచోట్ల అమ్మవారికి బోనాలు చేశారు. మహిళలు కుంకుమపూజలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు.



రాయికల్ మండలం ఆలూరులో బోనాలతో వస్తున్న మహిళలు



జగిత్యాలటౌన్: జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస మేజర్ గ్రామపంచాయతీ అధికారులు కొత్త భవన నిర్మాణం ప్రారంభించి ఏడాది గడుస్తున్నా ఇంకా పునాదుల దశలోనే ఉంది. గ్రామ పంచాయతీ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. జీపీ అద్దె భవనాలను తరచూ మారుస్తుండటంతో ముఖ్యమైన రికార్డుల భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. అసలు పంచాయతీ ఎక్కడ ఉంటుందో తెలియక ఇబ్బంది పడుతున్నామని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. భవన నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసేలా సంబంధిత కాంట్రాక్టరును ఆదేశించండి.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రఘువరన్, జిల్లా పంచాయతీ అధికారి, సెల్ నంబర్: 9963121936

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 9440061630, 9705346643

గీత కార్మికులకు ప్రభుత్వం చేయూత

• ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



రక్షణ కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాలరూరల్: గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు.జగిత్యాల రూరల్ మండలం అంతర్గాంలో కల్లుగీత కార్మికులకు మంజూరైన కాటమయ్య రక్షణ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీత కార్మికులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. వారు ప్రమాదానికి గురికాకుండ, రక్షణ కోసం కిట్లను అందజేస్తున్నామన్నారు.కార్యక్రమంలో గ్రంథాలయ మాజీ చైర్మన్ జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్ గౌడ్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి సాయిబాబా, ఎక్సైజ్ సీఐ రాజమౌళి, గౌడ సంఘం నాయకులు బాలు గౌడ్, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ తండ్రి మృతికి నివాళి

జగిత్యాల రూరల్ మాజీ ఎంపీపీ పాలెపు రాజేంద్రప్రసాద్ తండ్రి పాలెపు బుచ్చన్న శనివారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందగా, ఆదివారం పొలాస గ్రామంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ బుచ్చన్న మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

దుర్గామాత మండపంలో ఎమ్మెల్యే పూజలు

జగిత్యాల రూరల్ మండలం అంతర్గాంలో శ్రీ నవశక్తి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆదివారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు.

ఉచిత నేత్ర శస్త్ర చికిత్సలు

జగిత్యాలటౌన్: జగిత్యాల పావని కంటి ఆస్పత్రిలో ఆపి, రోటరీక్లబ్ ఆధ్వర్యంలో జగిత్యాల నియోజకవర్గానికి చెందిన 17మంది నిరుపేదలకు ఆదివారం నేత్ర వైద్య నిపుణులు, జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్‌కుమార్ ఉచిత కంటి శస్త్ర చికిత్సలు చేసి మందులు, కంటి అద్దాలు అందజేశారు.

శావ ఊరేగింపునకు భద్రత కల్పించాలి

మెట్‌పల్లిరూరల్: దసరా ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే దేవుని ఊరేగింపు(శావ) సమయంలో భద్రత కల్పించాలని మెట్‌పల్లి మండలం వెల్లుల వీడీసీ సభ్యులు,గ్రామస్తులు ఆదివారం ఎస్సైకి వినతి పత్రం అందించారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎస్సై సిబ్బందిని పంపిస్తామని తెలిపారు. కాగా తమ కాలనీకి శావ తీసుకురావడం లేదని దళితులు ఇప్పటికే ఆర్డీవో,పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

కథలాపూర్: మండలంలోని చింతకుంట శ్రీ సత్యానంద మహర్షి ఆశ్రమ స్వర్ణోత్సవ ఆహ్వాన పత్రికను ఆదివారం పీఠాధిపతులు, భక్తులు ఆవిష్కరించారు. సత్యానంద ఆశ్రమ పీఠాధిపతులు శ్రీహరి తీర్థస్వామి, విశోక తీర్థస్వామి పర్యవేక్షణలో ఆశ్రమంలో ప్రత్యేక వేడుకలు నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో స్వర్ణోత్సవ వేడుకలు ఉంటాయన్నారు. భక్తులు ప్రత్యేక భజనలు చేశారు.

కొత్తపల్లిని గ్రామ పంచాయతీ చేయాలని వినతి

సారంగాపూర్: మండలంలోని లచ్చనాయక్ తండా పంచాయతీ కింద ఉన్న కొత్తపల్లి శివారు గ్రామాన్ని గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని ఆదివారం కొత్తపల్లి వాసులు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కొత్తపల్లిలో జనాభా 350కి పైగా ఉందని, 270 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. కొత్తపల్లి లచ్చనాయక్‌తండా పంచాయతీకి 1.5 కిలోమీటర్ల దూరంలో ఉందని, ఇది అసౌకర్యంగా ఉందని కొత్తపల్లిని నూతన పంచాయతీగా ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. దీనిపై ప్రభుత్వంతో మాట్లాడి కొత్తపల్లి పంచాయతీ ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

బతుకమ్మ సంబరాలు



బస్టాండ్‌లో బతుకమ్మ ఆడుతున్న ఆర్టీసీ సిబ్బంది



మల్యాలలో బతుకమ్మలతో మహిళలు

కోరుట్ల రూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళా ఉద్యోగులు ఆదివారం బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రయాణికులతో కలిసి బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

మల్యాల: మండల కేంద్రంలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. మండల కేంద్రంలోని రెడ్డి కుల సంఘం మహిళలు ఇంటికో బతుకమ్మ పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ ఆడారు.

అన్ని వర్గాల సంక్షేమానికి కృషి

• చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



చర్చావేదికలో పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల: అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని ముత్యంపేటలో అంబేడ్కర్ సంఘ భవనంలో ఆదివారం నిర్వహించిన ఇష్టాగోష్టి చర్చావేదిక కార్యక్రమానికి ఎమ్మెల్యే మేడిపల్లి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తుందని, నిరుపేదలందరికి సంక్షేమ ఫలాలు అందిస్తామని అన్నారు. అనంతరం స్థానికులు ఎమ్మెల్యేను గజమాలతో సన్మానించారు. ఫంక్షన్ హాల్ నిర్మాణం పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలని కోరారు. కొండగట్టు ఆలయ ఆవరణలో మాదిగలను కేవలం స్వీపర్ పనికి మాత్రమే పరిమితం చేస్తున్నారని, మాదిగ బిడ్డల చదువులకు అనుగుణంగా కొండగట్టులోని వివిధ ఉద్యోగాల్లో అవకాశం కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఫంక్షన్‌హాల్‌కు నిధులు కేటాయించి, అర్హతకు అనుగుణంగా అందరికి అవకాశం కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ముత్యంపేటలో ఎస్సీ కాలనీలో హైమాస్ట్ లైట్లు ప్రారంభించారు. కార్యక్రమంలో మ్యాక గంగయ్య, మ్యాక లక్ష్మణ్, మారు పాక విశ్వనాథం, చిట్యాల గంగాధర్, శనిగరపు తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి జువ్వాడికి ఎమ్మెల్సీ నివాళి

కోరుట్ల: పట్టణంలోని వెటర్నరీ విశ్వవిద్యాలయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్ రావు విగ్రహానికి ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్ ఆదివారం పూల మాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కోరుట్ల ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, కృష్ణారావు, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

దేశంలో ప్రజాస్వామ్య సుస్థిరతకు కారణం అంబేడ్కర్

• ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ

సారంగాపూర్: దేశంలో ప్రజాస్వామ్యం సుస్థిరంగా ఉండడానికి మహనీయుడు, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కారణమని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు.మండలంలోని నాగునూర్ గ్రామంలో జరుగుతున్న అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ వేడుకల్లో ఆదివారం పాల్గొని అంబేడ్కర్‌కు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రజాస్వామ్యం బలమైన పునాదులతో, ప్రపంచానికి మార్గదర్శంగా ఉందని, దీని ద్వారా ఎన్నోదేశాలు మన రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నాయని, ఇదంతా అంబేడ్కర్ కృషి అన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘాల నాయకులు ఎవుసం గంగాధర్, పూదూరి శోభన్, బెక్కం శంకర్, అర్గిస్టు రాజు, మాలెపు సుధాకర్, దమ్మ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం బలోపేతానికి కృషి చేయాలి

కథలాపూర్: ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన మెట్‌పల్లి పట్టణానికి చెందిన మైలారపు లింబాద్రిని కథలాపూర్‌లో ఆ సంఘం నాయకులు ఆదివారం సన్మానించారు. శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన ఆర్యవైశ్య సంఘం నాయకుల సమావేశానికి లింబాద్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంఘం బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు మైలారపు నరేందర్, మండల ప్రతినిధులు బచ్చు కిషన్, నీలి శ్రీనివాస్, ఆమెటి నరేశ్, చింత లక్ష్మణ్, ఆరేటి ప్రసాద్, అజయ్, గంగాధర్, శ్రీనివాస్, పురుషోత్తం పాల్గొన్నారు.

బీర్‌పూర్ మండల ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడిగా రమేశ్

సారంగాపూర్: బీర్‌పూర్ మండల ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గంను ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రేగొండ రమేశ్, గౌరవ అధ్యక్షుడిగా అక్కినపల్లి రాజయ్య, ఉపాధ్యక్షుడిగా అనంతుల సత్తయ్య, ప్రధాన కార్యదర్శిగా అక్కినపల్లి రాము, కోశాధికారిగా గుండ రమేశ్, సలహాదారుడిగా కాసం వేణుగోపాల్, సభ్యులుగా గుండ సురేష్, ఎలగందుల అశోక్, అక్కిన పల్లి శ్రీనివాస్, కాసం మల్లేశం , గుండ వంశీ ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా మండల విద్యాధికారి సిరుపనాగభూషణం, సింగిల్‌విండో మాజీ చైర్మన్ పాత రమేశ్ వ్యవహరించారు.

లేగదూడకు జన్మదిన వేడుకలు



కేకు కట్ చేస్తున్న దంపతులు

సారంగాపూర్: బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన భైరవేని సత్యనారయణగౌడ్–భాగ్యలక్ష్మి దంపతులు ఆదివారం లేగదూడకు పుట్టినరోజు నిర్వహించారు. గతేడాది బారసాల నిర్వహించి, గ్రామంలో అన్నదానం చేసిన ఈ దంపతులు లేగదూడకు ఏడాది నిండడంతో కేక్ కట్ చేసి, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు.

ఆటలతో స్నేహభావం పెరుగుతుంది

మల్యాల: మండల కేంద్రంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీలో మండల కేంద్రానికి చెందిన డీఎస్ఎం–3 టీం విజేతగా నిలిచింది. విజేత జట్టుకు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, మల్యాల సీఐ నీలం రవి, ఎస్సై నరేశ్‌కుమార్ కప్పు అందజేసి, అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలతో గెలుపోటములను సమానంగా తీసుకునే మనస్తత్వం అలవడుతుందని అన్నారు. కార్యక్రమంలో సీఐ నీలం రవి, ఎస్సై నరేశ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తులు అందజేత

మెట్‌పల్లి: మున్సిపల్‌లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఆదివారం చైర్‌పర్సన్ రాణవేని సుజాత తమ నితిన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. ప్రతీ ఏడాది దసరా పండుగ సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆమె కార్మికులకు దుస్తులను అందజేస్తూ వస్తున్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ రాణవేని సత్యనారాయణ, డాక్టర్ ఆనంద్‌బాబు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మిత్రుల చేయూత

సారంగాపూర్: తమతో కలిసి చదివిన మిత్రుడు మృతిచెందడంతో మిత్రులు బాధిత కుటుంబానికి బాసటగా నిలిచారు. మండలంలోని కోనాపూర్ గ్రామానికి చెందిన తిరుకోవెల శ్రీనివాస్ గత నెలలో మృతిచెందాడు. ఆయనతో కలిసి 1994–97 సంవత్సరంలో జగిత్యాల ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో చదివిన మిత్ర బృందం తలా కొంత జమ చేసి, రూ. 45 వేలు మృతుడి భార్య శోభారాణి, కూతురు ఇందుమతి, కుమారుడు అభిరామ్‌లకు ఆదివారం అందించారు. కార్యక్రమంలో మల్లారెడ్డి, ప్రసాద్‌గౌడ్, శ్రీనివాస్, సత్యం, సురేశ్, కాంతారావు, నరసయ్య, చందు, వెంకటేష్, భీమన్న, శ్రీదీప్, లక్ష్మీనారాయణ, ధర్మయ్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రాయికల్: మండలంలోని భూపతిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003–04 లో పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయసమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా తమకు చదువుచెప్పిన గురువులను సన్మానించారు. 20 ఏళ్ల తర్వాత ఒకరికొకరు కలుసుకుని తమ పాత జ్ఞాపకాలు నెమరువేసుకుని ఉత్సాహంగా గడిపారు.

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి పట్టణంలోని వివేకానంద విద్యా నికేతన్ హైస్కూల్‌కు చెందిన 2009–10,2010–11 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు వెల్లుల శివారులోని వీఆర్ఎం,కేఎస్‌రెడ్డి గార్డెన్స్‌లలో వేర్వేరుగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించుకున్నారు.



భూపతిపూర్‌లో పూర్వవిద్యార్థులు



గోదూర్‌లో పూర్వ విద్యార్థుల సమావేశం

ఇబ్రహీంపట్నం: మండలంలోని గోధూర్ జెడ్పీ హైస్కూల్‌లో 1998–99 విద్యాసంవత్సరం పదోతరగతి పూర్తిచేసిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని సాయంత్రం వరకు ఆట పాటలతో సందడి చేశారు.

జగిత్యాలటౌన్: పట్టణంలోని గీతా విద్యాలయానికి చెందిన 2004–05 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. తమకు చదువుచెప్పిన గురువులను సన్మానించారు.

